క్లుప్తంగా

కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ముత్తంశెట్టి



మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ముత్తంశెట్టి దంపతులు

తగరపువలస: మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మహారాష్ట్రలోని కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారిని శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వాదంతో పాటు ప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఈశ్వరమ్మ మృతి



ఈశ్వరమ్మ భౌతిక కాయం వద్ద వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి మహేష్ తదితరులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు వెలంపేట వైఎస్సార్‌సీపీ నాయకురాలు దుంప ఈశ్వరమ్మ (62) అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి భీమిలి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఆమె కుమారులు ఆదినారాయణరెడ్డి, సాయిరెడ్డిలను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, కోల చంద్రశేఖర్, రంగూరి రాంబాబు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, బింగి హరికిరణ్‌రెడ్డి, చింతగుంట శివ, అక్కరమాని చినబాబు, జీరు శ్రీనివాసరెడ్డి, జల్లు రమేష్, రొక్కం శ్రీను తదితరులున్నారు.

ఎట్టకేలకు కొత్త కొవ్వాడ యూపీ స్కూల్ చైర్మన్ ఎన్నిక

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు శనివారం జరిగింది. చైర్మన్‌గా మీసా దేముడు ఎన్నికయ్యారు. రెండు సార్లు ఈ ఎన్నిక వాయిదా పడింది. ఈ నెల 8వ తేదీన జరగాల్సిన ఎన్నికను కోరం చాలకపోవడంతో వాయిదా వేశారు. 17వ తేదీన మళ్లీ ఎన్నిక నిర్వహించినా ఒకటి, నాల్గో తరగతులకు కోరం లేక మెంబర్లను ఎన్నుకోలేదు. దీనివల్ల చైర్మన్ ఎన్నిక జరగలేదు. ఇప్పుడు కోరం సరిపోవడంతో ఒకటి, నాల్గో తరగతులకు మెంబర్లను ఎన్నుకున్నారు. దీంతో చైర్మన్ ఎన్నిక జరిగింది. ఇక్కడ టీడీపీలో వర్గ విభేదాలు తలెత్తాయి. టీడీపీలో రెండు వర్గాలు ఉండడంతో ఇంతవరకు ఒక వర్గం నాయకుడు ఎన్నిక జరగకుండా తెర వెనుక కథ నడిపారనే విమర్శలున్నాయి.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఘన సత్కారం



నారాయణరావు దంపతులను సన్మానిస్తున్న ఎంఈవోలు రమణ, బాబూలాల్

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన నెట్టి నారాయణరావు దంపతులను ఘనంగా సత్కరించారు. విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు నారాయణ రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నారాయణరావు దంపతులను మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎంఈవోలు పి.రమణ, బాబూలాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు దుశ్శాలువాలతో సన్మానించారు.

వదలని వాన

- రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- జనజీవనానికి ఆటంకం



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



జాతర ఎదురుగా వుడా కాలనీ రోడ్డు జంక్షన్ వద్ద రోడ్డుపై చేరిన నీరు

మధురవాడ/తగరపువలస: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన నేపథ్యంలో భీమిలి పరిధిలో శనివారం ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. అధిక వర్షాల కారణంగా పాఠశాలలకు కూడా సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మధురవాడ అప్ బ్రిడ్జితో పాటు హైవే పై మధురవాడ బస్టాప్, పీఎం పాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం తదితర ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్డుపై చేరింది. అలాగే జాతర ఎదుగా ఉన్న వుడా కాలనీ జంక్షన్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల కాల్వలు, రోడ్లు ఏకం కావడంతో, ఆ నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ మైదానం చిత్తడిగా మారింది. వర్షాల కారణంగా ప్రైవేట్ మార్కెట్‌లో లావాదేవీలు అంతగా సాగలేదు. శనిత్రయోదశి పూజలకు కూడా వర్షం ఆటంకం కలిగించింది. డైలీ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. అంబేడ్కర్ కూడలిలో ప్రతిరోజూ పనుల కోసం ఎదురు చూసే వందలాది మంది కార్మికుల జాడ శనివారం కనిపించలేదు. ప్రజారవాణా బోసిపోయింది. ఇంటింటా పెన్షన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడ్డారు.



పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద రోడ్డుపై నిలిచిన నీటిలో వెళ్తున్న వాహనాలు



వర్షం కారణంగా బోసిపోయిన తగరపువలసలోని సర్వీస్ రోడ్డు

కల్లోల కడలి



మంగమారిపేట బీచ్‌లో ఎగసి పడుతున్న కెరటాలు

- ఎగసిపడుతున్న అలలు
- నిలిచిన చేపల వేట
- తీరానికే పరిమితమైన పడవలు, వేట సామగ్రి



తీరంలో నిలిపి ఉంచిన పడవలు, తెప్పలు

కొమ్మాది: భీమిలి తీర ప్రాంతంలో సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ, మంగమారిపేట, రుషికొండ తీర ప్రాంతాల్లో శనివారం ఈదురుగాలులతో పాటు సముద్ర కెరటాలు పెద్దఎత్తున ఎగసిపడుతున్నాయి. గతంలో కంటే సముద్రం ముందుకు రావడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి తీరానికి ఆనుకుని ఉన్న రాళ్లు, సువిశాల ప్రదేశం నీటితో నిండిపోయింది. మత్స్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు వేటకు విరామం ఇచ్చారు. వాయుగుండం నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంతాలకు ఆనుకుని నివాసముంటున్న మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రుషికొండ బీచ్‌లో పర్యాటకుల తాకిడి తగ్గింది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో ఇక్కడ బోటు షికారు నిలిపివేశారు.

నాలుగురోజులుగా తీరంలోనే తెప్పలు

భీమునిపట్నం: వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో భీమిలి తీరంలో చేపల వేట నిలిచిపోయింది. ఇక్కడ తీరంనుంచి ప్రతిరోజు సుమారు 200 వరకు పడవలు, తెప్పలపై మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి వస్తుంటారు. రెండు నెలలుగా వర్షాలు విరివిగా పడుతుండడంతో పాటు తుపాన్లు కూడా తోడవడంతో ఎక్కువ రోజులు చేపల వేట సాగలేదు. ప్రస్తుతం వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజులుగా పడవలు, తెప్పలు తీరానికే పరిమితమైపోయాయి. కొద్దికాలంగా చేపల వేట అంత ఆశాజనకంగా లేకపోవడంతో పాటు తుపానులు కూడా తోడవడంతో మత్స్యకారులకు మరింత కష్టంగా మారింది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా కింద రూ.10వేలు అందరికీ అందేది. తాము అధికారంలోకి వస్తే ఆ మొత్తాన్ని రూ.20వేలకు పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. ఓ వైపు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వేటకు తరచూ అంతరాయం వస్తుండటంతో ఆదాయం తక్కువగా ఉంటుండగా, మరోవైపు మత్స్యకార భరోసా కూడా అందకపోవడంతో గంగపుత్రులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

జగద్గురువు శ్రీ కృష్ణుడు



దాకమర్రి శ్రీకృష్ణ మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

తగరపువలస: అజ్ఞానపు చీకటి నుంచి జ్ఞానమనే వెలుగు వైపు నడిపే మార్గదర్శి, జగద్గురువు శ్రీకృష్ణుడు అని ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం శాఖ అధ్యక్షుడు కె.త్రినాథరావు అన్నారు. భీమిలి మండలం దాకమర్రిలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా మండపం వద్ద శనివారం భగవద్గీత పఠనం, ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం శ్రీకృష్ణ జన్మ విశిష్టత గురించి వివరించారు. శ్రీకృష్ణుడి జీవితమే చక్కని సందేశమని పేర్కొన్నారు. ప్రతీ ప్రతికూల పరిస్థితిని ఆయన ఎదుర్కొన్న విధానం మనందరం అనుసరించాల్సిన పాఠమని చెప్పారు. భగవద్గీత కేవలం పఠనీయ గ్రంథం కాదని ఆచరించాల్సిన జీవన విధానమని తెలియజేశారు. శ్రీకృష్ణుని భక్తితో పూజిస్తే ప్రకృతి వైపరీత్యాలు తగ్గి వర్షాలు సక్రమంగా కురుస్తాయన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు జి.కృష్ణ, సూరప్పడు, పైడన్న, పోలీస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు



తుప్పల్లోకి దూసుకుపోయిన కారు

పద్మనాభం: విజయనగరం-శొంఠ్యాం ఆర్ అండ్ బీ రోడ్డులో విజయనగరం నుంచి రెడ్డిపల్లి వస్తుండగా విజయానందపురం జంక్షన్‌లో శనివారం ఓ కారు అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకుపోయింది. వర్షంనీరు కారు ముందు అద్దాలపై పడడంతో ఎడమవైపు నుంచి వస్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పి కుడి వైపు రోడ్డు పక్కన తుప్పల్లోకి దూసుకు వెళ్లిపోయింది. అదృష్టవశాత్తు ప్రయాణికులెవరికీ ఏమీ కాలేదు. అయితే, ఈ ఘటనతో విజయనగరం, సింహాచలం నుంచి వస్తున్న బస్సులు, కార్లు, ఆటోలు నిలిచిపోయాయి. సుమారు పావుగంట సేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు వచ్చి మార్గం సుగమం చేశారు.

మాజీ సైనికులకు ఈసీహెచ్ ద్వారా వైద్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైనిక వెల్ఫేర్ బోర్డు అధికారి సత్యానందం

తగరపువలస: మాజీ సైనికులు వైద్యసేవల కోసం విశాఖ, విజయనగరం వంటి దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న ఆస్పత్రులలో ఈసీహెచ్ ద్వారా సేవలు పొందే వెసులుబాటు కల్పిస్తామని జిల్లా సైనిక వెల్ఫేర్ బోర్డు అధికారి జి.సత్యానందం తెలిపారు. భీమిలి రోడ్డులో శనివారం నిర్వహించిన మాజీ సైనికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సైనికులకు కేంద్రం అనేక రాయితీలు అందిస్తోందన్నారు. వారి పిల్లలు ప్రొఫెషనల్ కోర్సులు చదివితే అమ్మాయిలకు రూ.36వేలు, అబ్బాయిలకు రూ.30వేలు, హాస్టల్‌లో ఉండే పిల్లలకు రూ.10వేలు అందిస్తారన్నారు. మాజీ సైనికుల పిల్లలు మంచం మీద నుంచి లేవలేని పరిస్థితులు ఉంటే వారికి కూడా ఆర్థిక సాయం అందుతుందని వివరించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కేజీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మేకల శ్రీను, నందిక వెంకటరమణ, శీరపు వెంకటరెడ్డి, గోవింద్, సీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



ఎండాడలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస/కొమ్మాది: భీమిలి మండల పరిధిలోని 16 పంచాయతీలలో శనివారం 95 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్టు భీమిలి ఎంపీడీవో జానకి తెలిపారు. మండలంలో మొత్తం 6139 పెన్షన్లకు గాను సచివాలయ సిబ్బంది 5794 పూర్తి చేసినట్టు తెలియజేశారు. దాకమర్రి, అమనాం పంచాయతీలలో పెన్షన్ల పంపిణీని ఆమె పర్యవేక్షించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

– ఆనందపురం మండలంలో 97 శాతం పెన్షన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో ఎ.లవరాజు తెలిపారు. మండలంలో 8765 మంది పెన్షనర్లు ఉండగా 8475 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందించారన్నారు.

ఉద్యానవన రైతులకు సూచనలు



ఆనందపురంలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

తగరపువలస: అధిక వర్షాల కారణంగా ఉద్యానవన పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను జిల్లా ఉద్యానవనశాఖాధికారి కె.సత్యనారాయణరెడ్డి రైతులకు వివరించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలలో శనివారం పర్యటించిన ఆయన క్షేత్రస్థాయిలో రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత బ్లిటోక్స్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటిలో చేర్చి వేర్ల వద్ద పిచికారీ చేయాలని సూచించారు. కాలువలు తీసి నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ఆయన వెంట మండల ఉద్యానవన శాఖాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

దాకమర్రిలో ప్రబలుతున్న జ్వరాలు

- పంచాయతీలో పడకేసిన పారిశుధ్యం
- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్త



దాకమర్రి గ్రామం మధ్యలో పేరుకుపోయిన చెత్త



అధ్వానంగా ఉన్న డ్రైనేజీలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీని సీజనల్ జ్వరాలు చుట్టుముట్టాయి. ప్రతి ఇంట్లో పేషెంట్లు ఏదో ఒక జ్వరంతో బాధపడుతున్నారు. పంచాయతీలో పారిశుధ్యం పడకేసినందున జ్వరాలు స్థానికులను పట్టి పీడిస్తున్నాయి. గ్రామం మధ్య చెత్త పేరుకుపోయింది. డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పంచాయతీలో పారిశుధ్య పరిస్థితులు చక్కదిద్దాలని పంచాయతీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయతీలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

‘స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి’

తగరపువలస: ఆనందపురం-పెందుర్తి సర్వీస్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ఈ రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రమాద స్థలాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. హైవే నిర్మాణ సమయంలో కొండలను దొలిచి మలుపులతో కూడిన సర్వీస్ రోడ్లను నిర్మించడం వలన వేగంగా వచ్చే వాహనాలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అలముకున్న అంధకారం

- ఆర్‌జీకే కాలనీ మొదటి వీధిలో వెలగని వీధిలైట్లు
- ఫిర్యాదులు బుట్టదాఖలు



చీకటి అలముకున్న ఆర్‌జీకే కాలనీ మొదటి వీధి

మధురవాడ: మారికవలస జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం రాజీవ్ గృహకల్పకాలనీ ఎస్‌టీపీ ప్లాంట్ మొదటి వీధిలో అంధకారం అలముకుంది. అనేక విజ్ఞప్తుల మేరకు ఇక్కడ జీవీఎంసీ అధికారులు లైట్లు ఏర్పాటు చేసినా, అవి మూన్నాళ్ల ముచ్చటగానే పని చేశాయి. ఇక్కడ ఒక్క లైట్ పాడై నెలలు దాటిపోతోంది. ఆ సమీపంలోనే మరికొన్ని పాడయ్యాయి. వీటిపై జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం హైవే జంక్షన్, అన్న క్యాంటీన్‌కి అత్యంత చేరువలో ఉంటుంది. ఈ మార్గం మీదుగా కొత్త కాలనీ, పాఠశాలలు, చర్చికి వెళ్తుంటారు. దీనిని ఆనుకుని ఓ ఖాళీ ప్రైవేట్ స్థలం ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, ఆకతాయిలు మాటు వేస్తున్నారు. ఈ లే అవుట్‌లో తుప్పలు, ముళ్లపొదలు కూడా ఎక్కువగా ఉండటంతో సాయంత్రమైతే అటుగా వెళ్లడానికి స్థానికులు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా చూసి, అంధకారం తొలగేలా చూడాలని కోరుతున్నారు. అలాగే తుప్పలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జోరుగా వినాయక విగ్రహాల తయారీ



ఆకట్టుకుంటున్న శివపుత్రుడి ప్రతిమ



విక్రయాలకు సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

- వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న పార్వతీసుతుడు
- విక్రయాలకు సిద్ధంగా విగ్రహాలు

పద్మనాభం: వినాయక చవితి దగ్గర పడుతుండంతో పార్వతీనందనుడి విగ్రహాల తయారీ ఊపందుకుంది. మండలంలోని కృష్ణాపురంలో పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పక్కన గణపతి విగ్రహాలు చూడచక్కగా రూపుదిద్దుకుంటున్నాయి. పాండ్రంగి గ్రామానికి చెందిన శిల్పకారుడు పి.వెంకట రమణ వీటిని తయారు చేస్తున్నారు. జూన్ నెల నుంచి వీటి తయారీలోనే నిమగ్నమయ్యారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రెండు నుంచి తొమ్మిది అడుగుల ఎత్తు గల 70 విగ్రహాలను తయారు చేసినట్లు చెప్పారు. మట్టితో అర అడుగు నుంచి అడుగున్నర ఎత్తు గల బొమ్మలను 100 వరకు తయారు చేశామని తెలియజేశారు. ప్రతిమలు కావల్సిన వారు 8790033810 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

12 ఏళ్లుగా ఈ వృత్తిలోనే..



2012 నుంచి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాను. వినాయక చవితికి ముందు మూడు నెలల నుంచి బొమ్మల తయారీ ప్రారంభిస్తాను. బొమ్మలు అన్నీ అమ్ముడైతే కష్టానికి ఫలితం ఉంటుంది.

– పి.వెంకట రమణ, రూపశిల్పి

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ భాగంగా పలు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణ రావు తెలిపారు. డ్రోన్స్ తయారీ, అసెంబ్లింగ్ టెక్నిషియన్ కోర్సుతోపాటు ఎలక్ట్రిషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. పదో తరగతి పాసైన వారు కాలేజీలోని స్కిల్ హబ్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 7287069457 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.